

# జాతీయం- అంతర్జాతీయం





## ఆక్రమణలపై కర్నాటక ప్రభుత్వం ఉక్కుపాదం

- ఫుట్‌పాత్‌లపై ప్రత్యేక డ్రైవ్
- స్వయంగా పర్యవేక్షించిన డీకే

**బెంగళూరు, జులై 10 (ఎ.ఎం.ఎస్):** మెట్రో పాలిటన్ సిటీలో భారీ యెత్తున ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురువుతున్న విషయం తెలిసిందే. పాదచారులు తీవ్ర ఇబ్బందులు కలిగించేలా కొందరు ఫుట్ పాత్ లపై అనేక షాప్ లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అనుమతులు లేకుండా ఫుట్ పాత్ లపై ఏర్పాటు చేసిన అనేక షాప్ లను తొలగించేందుకు కర్నాటక ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. బెంగళూరు వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి భారీ యోత్తున సదురు దుకాణాలను తొలిగిస్తోంది. ఈ కార్యక్రమాన్ని స్వయంగా ఆ రాష్ట్ర సీఎం డీకే శివ కుమార్ పరివేక్షించారు. పరిశుభ్రంగా, సురక్షితంగా, బెంగళూరు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాదచారుల భద్రతను మెరుగుపరచడంతో పాటు పేద వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. బెంగళూరుకు పెరుగుతున్న ప్రపంచ స్థాయి ప్రాముఖ్యతకు మెరుగైన పౌర మౌలిక సదుపాయాలు, సురక్షితమైన ప్రజా ప్రదేశాలు అవసరమన్నారు. భారతదేశం, ప్రపంచం.. బెంగళూరు వైపు చూస్తున్నాయి, ఇది అత్యంత సురక్షితమైన నగరాలలో ఒకటిగా ఉండాలని తాము కోరుకుంటున్నాము. గత మూడేళ్లలో, ఈ సమస్యల కారణంగా 900 మందికి పైగా పాదచారులు ప్రాణాలు కోల్పోయారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్నారు. పాదచారుల కోసం ప్రభుత్వం భారీ ఎత్తున పనులు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటివరకు 135 కిలోమీటర్లకు పైగా ఫుట్‌పాత్‌లపై పనులు పూర్తయ్యాయి. వేలాది దుకాణాలను తొలగించారు. దాదాపు 50,000 ఆక్రమణలను తీసివేశారు. వీటిలో దుకాణాలు, ర్యాంపులు, ఇతర అనధికార నిర్మాణాలు ఉన్నాయని సీఎం డీకే శివకుమార్ వివరించారు.

## చైనాలో అతిపెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు



- వడివడిగా అడుగులేస్తున్న డ్రాగన్ దేశం
- భారత్ నుంచి తీవ్ర అభ్యంతరాలు

**టిబెట్, జులై 10:** టిబెట్‌లో యార్లుంగ్ సాంగ్పో (భారత్‌లోబ్రహ్మపుత్ర) నదిపై ప్రపంచంలోనే అతి పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా వడివడిగా అడుగులు వేస్తోంది. అయితే, దీనికి భారీ ప్రకృతి వైపరీత్యాల ముప్పు ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది క్రియాశీల భూకంపాల జోన్‌లోనే నిర్మితమవుతోందని బీజింగ్ ప్రభుత్వ మద్దతుతో పనిచేస్తున్న భూగర్భ శాస్త్రవేత్తలు తాజాగా హెచ్చరించారు. ఏడాదికి దాదాపు 300 బిలియన్ కిలోవాట్ల హవర్స్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో డ్రాగన్ ఈ ప్రాజెక్ట్ నిర్మించతలపెట్టింది. ఈ ప్రాజెక్ట్‌పై భారత్‌వైపు నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కౌంటర్‌గా భారత్ కూడా బ్రహ్మపుత్రపై ఓ ప్రాజెక్ట్ నిర్మించే యోచనలో ఉంది.

చైనాకు చెందిన సెడిమెంటరీ అండ్ తేథియాన్ జియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఈ మెగా డ్యామ్ పైజెన్ ఫాల్ట్ (యాక్టివ్ ఫాల్‌ట్‌లైన్) పైనే నిర్మితమవుతోంది. దీనివల్ల కొండచరియలు, భూకంపాలు సంభవించడం, నిర్మాణంలో అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడించిన ఈ వివరాలు.. ప్రాజెక్ట్ భద్రతపైనే కాదు భారత్‌పై చూపే ప్రభావం గురించి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత బ్రహ్మపుత్ర నదిగా మారి.. బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించే ముందు లక్షల మంది ప్రజల జీవనాధారంగా నిలుస్తుంది.

చైనా చేపట్టిన ఈ మెగా డ్యామ్ ఇప్పటికే అంతర్జాతీయ వివాదంగా మారింది. ఎగువ చైనా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ వల్ల బ్రహ్మపుత్రలో నీటి భద్రత, పర్యావరణం, దిగువన ఉన్న పౌరుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని భారత్ పలుసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా, చైనా శాస్త్రవేత్తలే మెగా డ్యామ్‌లో భౌగోళిక ముప్పు ఉందని అంగీకరించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, చైనా జియోలాజికల్ సర్వే సివిల్‌మిలిటరీ ఇంటిగ్రేషన్ సెంటర్, మిడిల్ యార్లంగ్ జాంగ్బో రివర్ నేచురల్ రిసోర్సెస్ అబ్జర్వేషన్ అండ్ రీసెర్చ్ స్టేషన్‌కు చెందిన పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం చేపట్టారు. "ఐస్ ఏజ్ (హిమయుగం) కాలం నుంచి అత్యంత చురుకుగా ఉన్న పైజెన్ ఫాల్ట్, ఆనకట్టలు, రోడ్లు, వంతెనలు, సొరంగాలతో పాటు జలాశయ ప్రాంతంతో సహా సమీపంలోని నిర్మాణాల స్థిరత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని పరిశోధకులు రాశారు. ఈ ఫాల్ట్ లైన్ కారణంగా చుట్టుపక్కల ఉన్న శిలలు దెబ్బతిన్నాయని, తద్వారా ఇంజనీరింగ్ నిర్మాణాలు బలహీనపడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. జలాశయం చుట్టూ ఉన్న భూభాగం చాలా బలహీనంగా ఉందని, ఇది ప్రధాన వాలు వైఫల్యాల సంభావ్యతను పెంచుతుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల డ్యామ్ నిండిన తర్వాత నీటి ఒత్తిడికి, భూకంపాల ప్రభావానికి రెండువైపులా ఉన్న కొండచరియలు చాలా సులభంగా విరిగిపడే ప్రమాదం ఉందని చెప్పారు.

## నన్ను చంపినా ఫరవాలేదు..

- డిసెంబరులో నా దేశానికి వెళతా
- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యాఖ్యలు



**ఢాకా, జులై 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ పార్టీ నాయకురాలు షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వదేశానికి వెళ్లి న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. మాతృదేశానికి వెళ్లే ఆలోచనలో ఉన్నానని ఆమె చెప్పారు. రాయిటర్స్ వార్త సంస్థకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. అరెస్టుకు లేదా చావడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆమె ఉద్ఘాటించారు. "స్వదేశానికి వెళ్లిన తర్వాత నన్ను వాళ్లు అరెస్టు చేయొచ్చు.. ప్రాణాలు తీసే అవకాశమూ ఉంది.. తీవ్ర అణచివేతకు గురువుతోన్న నా పార్టీ నేతలు, కార్యకర్తల కోసం నేను వెళ్లి తీరాలి.. ఒకవేళ మరణమే తథ్యమైతే నా తల్లిదండ్రులను సమాధి చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా" అని షేక్ హసీనా స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ వచ్చే డిసెంబరులో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు బంగ్లాదేశ్‌కు వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని నిర్ణయానికి వచ్చామని చెప్పారు. అయితే, తన అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నానని ఆమె పేర్కొన్నారు.

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ యువత జులై 2024లో చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారి.. చివరకు షేక్ హసీనా పదవికి ఎసరు తెచ్చాయి. అదే ఏడాది ఆగస్టు 5న రాజీనామా చేసిన దేశం విడిచి భారత్‌కు పారిపోయిన వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే, యువత నిరసనలను అణచివేయడంలో హసీనా పాత్ర ఉందని ఆరోపిస్తూ అనేక కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను హసీనా తోసిపుచ్చారు. కానీ, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మాత్రం విచారణ చేపట్టి ఆమెకు గతేడాది మరణశిక్ష విధించింది.



## బాధితులకు సర్కారు కొలువులు

- కరూర్ తొక్కిసలాటపై విజయ్ ప్రభుత్వ నిర్ణయం

**చెన్నై, జులై 10 (ఎ.ఎం.ఎస్)**: కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయానికి మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మధ్యంతర ఊరటనిచ్చింది. ఈ నియామకాలపై స్టే విధించాలన్న పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అయితే, ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలికమని, కేసులో తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అలాగే, నియామకాలు పొందిన వారు తొలి నెల జీతం అందుకునేలోపు కేసు విచారణను పూర్తి చేయాలని కోర్టు నిర్ణయించింది. తదుపరి విచారణను జూలై 21కు వాయిదా వేసింది.

## భారత పోలీస్ అధికారిపై అభియోగాలు

- నమోదు చేసిన ఎఫ్.బీ.ఐ.
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు



**న్యూఢిల్లీ, జులై 10(ఎ.ఎం.ఎస్):** అంతర్జాతీయ దోపిడీ ఆరోపణల కేసులో భారత పోలీస్ అధికారిపై అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అభియోగాలు నమోదుచేసింది. పంజాబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గురిందర్‌జిత్ సింగ్ నాగ్రాకు 4 లక్షల డాలర్ల దోపిడీ కేసులో సంబంధం ఉన్నట్టు ఎఫ్‌బీఐ అధికారులు ఆరోపించారు. అమెరికాలోని కుటుంబాలను లక్ష్యంగా చేసుకునే క్రిమినల్ ముఠాలు లారెన్స్ బిష్ణోయ్, జగ్గు భగవాన్‌పూరియా గ్యాంగులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేశారు. ఎఫ్‌బీఐ ఆరోపణలతో పంజాబ్ పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఉన్న టాండా పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)గా గురిందర్‌జిత్ సింగ్ నాగ్రా విధులు నిర్వహిస్తున్నారు. ఎఫ్.బీ.ఐ.దర్యాప్తు చేస్తున్న ఒక దోపిడీ కేసులో ఆయనకు ప్రమేయం ఉందని సోషల్ మీడియాలో వార్తల నేపథ్యంలో ఆయనను వెంటనే హోషియార్‌పూర్‌లోని పోలీస్ లైన్స్‌కు బదిలీ చేయాలని సీనియర్ ఎస్పీ ఆదేశించారు. ముందస్తు చర్యగా ఆయనను బదిలీ చేశామని, ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించామని ఆయన తెలిపారు. ఎఫ్‌బీఐ అభియోగ పత్రంలో నాగ్రా పేరు ఉన్నట్లు వార్తలు రావడంతో దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేలా విచారణను జలంధర్ రూరల్ ఎస్పీకి జలంధర్ రేంజ్ డీఐజీ అప్పగించారు. భారత్‌కు చెందిన ఒక వ్యవస్థీకృత నేర ముఠాలపై అమెరికా అభియోగపత్రంలో నాగ్రాకు సంబంధం ఉందని మీడియా నివేదికలు, సోషల్ మీడియా ద్వారా వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న పంజాబ్ పోలీసులు.. విచారణకు ఆదేశించారు. సంబంధిత వాస్తవాలు, ఆరోపణలన్నింటినీ పరిశీలించాలని విచారణ అధికారిని ఆదేశించారు. ఈ విచారణలో తేలే అంశాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని పంజాబ్ పోలీసులు తెలిపారు.

'ఆపరేషన్ హార్డ్ బాల్' కింద ఓ అంతర్జాతీయ దోపిడీ వ్యవహారంపై ఎఫ్‌బీఐ దర్యాప్తు చేపట్టింది. నివేదికల ప్రకారం గ్యాంగ్‌స్టర్ జగ్గు భగవాన్‌పురియా ఒక భారతీయ జైలు నుంచి నేర ముఠాను నడిపాడని, పంజాబ్ పోలీసు అధికారి గురిందర్‌జిత్ సింగ్ కల్పిత హత్య కేసులో అమెరికాకు చెందిన ఒక కుటుంబాన్ని ఇరికించడానికి ప్రయత్నించాడని అభియోగపత్రం ఆరోపించింది. ఒక దోపిడీకి సంబంధించిన ఎఫ్‌బీఐ దర్యాప్తులో ఇతని పేరు కూడా ఉంది.

## యూరప్‌నకు ట్రంప్ వింత షరతులు

- గ్రీన్‌లాండ్ కోసం సహకరించాలంటూ విజ్ఞప్తి
- నాటోతో సంబంధాలు దెబ్బతింటున్నాయంటూ ఆక్రోశం



**వాషింగ్టన్, జులై 10:** యూరప్‌లో అమెరికా సైన్యం ఉండాలంటే మిత్రదేశాలు రెండు షరతులను పాటించాల్సి ఉంటుందని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. గ్రీన్‌లాండ్‌పై తన ఆశయాలకు సహకరించాలని, ఇరాన్‌పై సైనిక చర్యకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిల్డెన్‌హాల్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ (ఆర్ఏఎఫ్) వైమానిక కేంద్రంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. అమెరికా సైనిక చర్యకు మద్దతు ఇస్తూ ఇరాన్‌ను ఏకాకిని చేసేందుకు యూరోపియన్ దేశాలు సుముఖత ప్రదర్శించకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. అమెరికాకు సాయం అందించే విషయంలో ఆ దేశాలు ఆలస్యంగా ప్రతిపాదనలు పంపాయని చెప్పారు. 'అంతా గ్రీన్‌లాండ్, ఇరాన్‌పై ఆధారపడి ఉంది. వారు ఇప్పుడు సాయం చేయాలని అనుకుంటున్నారు. కానీ ఇప్పటికే కొంత ఆలస్యం జరిగింది. ఎందుకంటే ఇప్పుడు చేయడానికి పోరాటం లేదు. వారికి అవకాశం ఉన్నప్పుడు సాయం చేయకూడదని అనుకున్నారు.

అయితే మనం ఆ విషయాన్ని మర్చిపోతున్నాం. ఇప్పుడేమో ఇరాన్ విషయంలో సాయం చేయాలని ఆరాటపడుతున్నారు. కానీ మనకు నిజంగా సాయం అవసరం లేదు' అని అన్నారు. గ్రీన్‌లాండ్ అమెరికా నియంత్రణలోనే ఉండాలని ట్రంప్ నాటో సదస్సులో పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే. ఆ ఆర్కిటిక్ ద్వీపం అమెరికా భద్రతకు వ్యూహాత్మకమైనదని ఆయన వాదించారు. అంతకుముందు జరిగిన ఓ సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ సాధించడం వాషింగ్టన్‌దాని మిత్రదేశాల సంబంధాలను ప్రభావితం చేయవచ్చునని అంగీకరిం చారు. అయితే అది నాటోతో తన సంబంధాలను దెబ్బతీస్తుందని చెప్పారు.

## పిటిషనర్‌పై జడ్జి తీవ్ర ఆగ్రహం

- పత్రాలు విసిరేయటంతో కలకలం
- సుప్రీంకోర్టులో ఘటన



**న్యూఢిల్లీ, జులై 10 (ఎ.ఎం.ఎస్) :** సుప్రీంకోర్టులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.

అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు.

## చైనాలో ఘోర అగ్ని ప్రమాదం

- 28 మంది కార్మికులు దుర్మరణం
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**బీజింగ్, జులై 10:** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి.

భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని

, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

## పీవోకేలో ఉద్రిక్తతలు తీవ్రం



- పాకిస్తాన్‌కు 48 గంటల డెడ్‌లైన్
- భారీ ప్రదర్శనకు జేఏసీ నిర్ణయం

**ఇస్లామాబాద్, జులై 10:** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అక్కడ ప్రజా ఉద్యమానికి నేతృత్వం వహిస్తోన్న జమ్మూ కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాకిస్థాన్ ప్రభుత్వానికి 48 గంటల డెడ్‌లైన్ విధించింది. ఆలోగా తమ 38 డిమాండ్లను అంగీకరించకుంటే భారీ ఎత్తున నిరసనకు దిగి, తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించింది. జులై 27 జరగనున్న స్థానిక శాసనసభ ఎన్నికల్లో 12 సీట్లను శరణార్థులకు కేటాయించడం ఈ ఉద్రిక్తతలకు కారణం.

జూన్ 9న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ముజఫరాబాద్‌కు భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు జేఏఏసీ ప్రకటించింది. ఇది ఇటీవలి కాలంలో ఈ ప్రాంతం చూసిన అతిపెద్ద రాజకీయ ఘర్షణలలో ఒకటిగా మారుతుందనే సంకేతాలు ఇచ్చింది.

శరణార్థులకు సీట్లు కేటాయింపు పీఓకే రాజకీయాలపై ఇస్లామాబాద్ అసమానమైన ప్రభావాన్ని కొనసాగించడానికి వీలు కల్పిస్తాయని జాక్ వాదిస్తోంది. జర్నలిస్ట్ లవ్ పూరి ప్రకారం.. 12 శరణార్థుల సీట్లు పాకిస్థాన్‌లోని సుమారు 4.36 లక్షల నమోదిత ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మిగిలిన 33 ప్రత్యక్షంగా ఎన్నికయ్యే సీట్లు పీఓకేలో నివసిస్తున్న దాదాపు 33 లక్షల ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ ప్రాంత నివాసితులకు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల కంటే శరణార్థుల నియోజకవర్గాలకు ఇది ఎన్నికల్లో ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తుందని వాదిస్తున్నారు. దీనికి తోడు 12 రిజర్వ్ సీట్లను రద్దుచేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని పీఓకే సుప్రీం కోర్టు జూన్ 7న తీర్పు ఇచ్చింది. పాకిస్థాన్ సైన్యం, పీఓకే ఉద్యమకారులకు జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. శరణార్థుల సీట్ల అంశం తక్షణ సమస్యగా మారినప్పటికీ, జేఏఏసీ చార్టర్ అంతకంటే లోతైన ఆర్థిక అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. రిజర్వ్ సీట్లను రద్దు చేయాలని కోరడంతో పాటు, జలవిద్యుత్ ప్రాజెక్టులపై పూర్తి పునఃసమీక్ష, విపరీతంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి నిత్యావసర వస్తువులపై అధిక సబ్సిడీలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేసింది. తమ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు స్థానికులు అధిక ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని కూడా వాదిస్తోంది. రాజకీయ వివక్ష, ఆర్థిక నిర్లక్ష్యం వంటి వాటిపై స్థానికులలో పెరుగుతున్న అసంతృప్తిని ఈ డిమాండ్లు ప్రతిబింబిస్తున్నాయి.



## 13న అయోధ్య పిటిషన్లపై విచారణ

- సుప్రీంకోర్టు వెల్లడి
- పోలీసు కస్టడీలో ప్రధాన నిందితుడు

**అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌లను జులై 13(సోమవారం) విచారించనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. ఈ పిటిషన్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు జాబితా అయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయిఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిలో ఒకరైన అనుకల్ప్ మిశ్రాను అయోధ్య పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు..**

**న్యూఢిల్లీ, జులై 10 (ఎ.ఎం.ఎస్):** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌లను జులై 13(సోమవారం) విచారించనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. ఈ పిటిషన్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు జాబితా అయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావుల విఐపి దర్శన పాస్ ఐడీలను ట్రస్ట్ నిలిపివేసిందన్న వార్తలను రామజన్మభూమి ఆలయ ట్రస్ట్ సభ్యులైన మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ స్పష్టం చేశారు. చంపత్‌రాయ్ ఐడిని వినియోగించి పాస్‌లు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిలో ఒకరైన అనుకల్ప్ మిశ్రాను అయోధ్య పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయోధ్య నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను చేపడుతున్న సంగతి తెలిసిందే. అయోధ్యలోని రామమందిర విరాళాల లెక్కింపు గదిలో తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్నట్లు సిట్ ప్రాథమిక విచారణలో గుర్తించింది.

అక్కడి సిబ్బంది తమ దుస్తులు, జేబులు, షూ, ఇతర వ్యక్తిగత వస్తువులలో నగదు కట్టలను దాచిపెట్టారని పేర్కొంది. అలాగే ఈ చోరీ అనేది ఏదో ఒక సందర్భంలో జరిగిన ప్రత్యేక సంఘటన కాదని, ఒక పద్ధతి ప్రకారం , పదేపదే జరిగిన వ్యవహారమని తెలిపింది.

